క్లుప్తంగా

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్


స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్

బీచ్‌రోడ్డు: బిజీ లైఫ్ గడుపుతున్న నేటితరానికి శారీరక.. మానసిక ఉల్లాసం.. ఉత్సాహాన్ని ఇచ్చే క్రీడలు కూడా చాలా అవసరమని నారాయణ విద్యా సంస్థల ఏజీఎం రాజ్‌కుమార్ అన్నారు. వీఎంఆర్‌డీఏ పార్కులో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒత్తిడి తగ్గి మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అందుకే ప్రతి ఏటా సిబ్బందికి, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 400 మంది సిబ్బంది ఖోఖో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్‌ఐలు, కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్, సాఫ్ట్ స్కిల్స్ టీం, ఏవోలు స్పోర్ట్స్ మీట్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి


వేణుగోపాలరావు మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవలో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. సురకాసుల వేణుగోపారావు(54) అనే వ్యక్తి ఆరిలోవ భగత్‌సింగ్ నగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడు హెల్త్ సిటీలోని ఒమేగా ఆస్పత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. శనివారం అతడు ఇంటి వద్ద మద్యం తాగిన మైకంలో బయటకు వెళ్లి మూత్ర విసర్జన చేస్తుండగా.. కళ్లు తిరిగి జారి కింద పడిపోయాడు. వెంటనే హార్ట్ స్ట్రోక్ వచ్చి మృతి చెందినట్లు మృతుడి కుమారుడు ధీరజ్ కుమార్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పౌర గ్రంథాలయం నిర్వహణ భేష్


లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సీతంపేట: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకరరావు శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఉద్యోగార్థులకు కల్పించిన సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక మోడల్ గ్రంథాలయంగా నిర్వహిస్తున్నారని నిర్వాహకులను ఆయన అభినందించారు. విద్యార్థులు ఏయే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కొంతమంది విద్యార్థులు గ్రూప్–1కు ప్రిపేర్ అవడాన్ని అభినందించారు. ప్రభుత్వ గ్రంథాలయాలను కూడా ఇదే విధంగా తీర్చిదిద్దాలని శంకరరావు సూచించారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పూల మొక్కలు కనుమరుగు


ముడసర్లోవలో కొత్త రోడ్డుకు ఇరుపక్కలా దట్టంగా మొలిచిన పిచ్చి మొక్కలు

- ముడసర్లోవ కొత్త రోడ్లపై నాటిన బ్యూటీ ప్లాంట్స్‌కు రక్షణ కరవు
- దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలతో ఎండిపోతున్న వైనం

ఆరిలోవ: ఎంతో ప్రశాంతమైన, సుందరమైన ముడసర్లోవ ప్రాంతంలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగాయి. ఇక్కడన్నీ డబుల్ రోడ్లే కావడంతో డివైడర్లపై జీవీఎంసీ ఉద్యానవనాధికారులు గతంలో అందమైన పూల మొక్కలు, నీడనిచ్చే పలు రకాల మొక్కలను నాటించారు. పిచ్చి మొక్కల వల్ల అవన్నీ నేడు కనిపించకుండా పోతున్నాయి.

విశాలమైన రహదారులు..

చుట్టూ పచ్చని కొండలు, విశాలమైన రహదారులపై ఉండటంతో ముడసర్లోవ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం అధిక సంఖ్యలో వృద్ధులు, యువకులు ఇక్కడికి వస్తుంటారు. సెలవు రోజుల్లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇక్కడ విశాలమైన రహదారులపైన, వాటి పక్కన ఖాళీ మైదానాల్లోనూ క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలాడుతూ సందడి చేస్తుంటారు. ఈ రోడ్ల మీదుగా రామకృష్ణాపురం వద్ద బీఆర్‌టీఎస్ కూడలికి చేరే వాహన చోదకుల రద్దీ కనిపిస్తుంది. దీంతో ఇక్కడి రహదారులపై నిత్యం సందడిగా ఉంటుంది.

రక్షణ కరువై..

గతేడాదిలో నగరంలో జరిగిన జీ–20 సదస్సులో భాగంగా ముడసర్లోవ ప్రాంతం సందర్శనకు వచ్చిన పలు దేశాల ప్రతినిధులను ఆకట్టుకునేలా డంపింగ్ యార్డు నుంచి వనదేవత అమ్మవారి గుడి వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్లకు పైగా ఆహ్లాదం, అందం ఇచ్చే మరింత ఆకర్షణీయమైన పలు రకాల పూల మొక్కలను ప్రత్యేకంగా నాటించారు. అవన్నీ కొన్నాళ్ల పాటు పూసిన పూలతో అందాలు ఒలికించాయి. ఇటుగా వెళ్లే వాహన చోదకులను, వాకర్లను ఆకర్షించేవి. ఇప్పుడా అందాలు అక్కడ కనుమరుగయ్యాయి. డివైడర్లలో నాటిన పూల మొక్కలకు సంరక్షణ కరువవడంతో పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. రహదారులకిరువైపులా, డివైడర్లపై దట్టమైన పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో వాటి మధ్య పూల మొక్కలు ఎదగలేక ఎండిపోతున్నాయి. కొద్ది రోజుల వరకు కనువిందు చేసిన పూల మొక్కలకు బదులుగా పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఈ పొదలు విషసర్పాలకు నిలయంగా మారాయి. పాములు నిత్యం ఆ మొక్కల నుంచి రోడ్లపైకి చేరుతున్నాయి. దీంతో అటుగా వెళ్లడానికి భయపడుతున్నామని వాహన చోదకులు, వాకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డివైడర్లపై పిచ్చి మొక్కలు తొలగించి పూల మొక్కలు నాటించి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.


పిచ్చి మొక్కల మధ్య ఎండిపోతున్న బ్యూటీ ప్లాంట్


రోడ్డు మధ్య డివైడర్‌పై పూల మొక్కలు కనిపించకుండా పెరిగిన పిచ్చి మొక్కలు

బీసీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి


మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఎంవీపీకాలనీ: దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమానికి కేంద్రంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో సంఘ సభ్యులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి జాతీయ స్థాయిలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో అత్యధిక జనాభాగా బీసీలు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో తగిన భాగస్వామ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీసీల అభ్యున్నతికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీల సంక్షేమానికి కేంద్రం రూ.లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించడంతోపాటు ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను రెట్టింపు చేయాలని, బీసీ కుల వృత్తులకు వంద శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని విన్నవించారు. రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు పూర్తిస్థాయి ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్‌రావు, బర్ల పైడం నాయుడు, గంగు మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగానే కోడ్ ఉల్లంఘన


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రాల బ్యానర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న సంఘ నాయకులు

బీచ్‌రోడ్డు: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం వల్ల బహిరంగంగా కోడ్ ఉల్లంఘనలకు పలువురు పాల్పడుతున్నారు. విశాఖపట్నం చౌక దుకాణదారుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం బీచ్ రోడ్డులో బహిరంగంగానే ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి మనోహర్ ఫొటోల బ్యానర్‌కు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల కోడ్ సమయంలో ఇలా బహిరంగంగా రాజకీయ నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడం కోడ్‌ను ఉల్లంఘించడమేనని పలువురు చెబుతున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారే తప్ప.. అడ్డు చెప్పే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం.

అలరించిన డ్యాన్స్ ఫెస్టివల్


డ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

సీతంపేట: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన డ్యాన్స్ ఫెస్టివల్ అలరించింది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 50 మందికి పైగా నృత్య కళాకారులు జానపద, కూచిపూడి, కథక్ ప్రదర్శనలు చేశారు. వీరిని తీర్చిదిద్దిన నాట్య గురువులు ఆర్.రజని, అనిల్ తెలికిచర్ల, సౌమ్య, మంగళ దివ్య, బి.సుధాపౌర్ణిమ, కరణం కుమార్‌లను అతిథులు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, బాదంగీర్ సాయి చేతుల మీదుగా సత్కరించారు. నృత్యంతో అలరించిన చిన్నారులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గురువుల వద్ద నేర్చుకున్న నాట్యకళను విడిచిపెట్టకుండా ప్రాక్టీస్ చేయాలన్నారు. నాట్యం దేవుడిచ్చిన వరమని, భక్తిశ్రద్ధలతో నేర్చుకుని కోరుకున్న రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎం.వి.సుబ్రహ్మణ్యం, ఉమేష్ చంద్ర, కీర్తి అకాడమీ అధ్యక్షురాలు బిందు లీమ్మ కీర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి


జ్యోతి వెలిగించి వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి


విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న సీపీ బాగ్చి

అల్లిపురం : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సూర్యాబాగ్ పోలీస్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యంతో లక్ష్య సాధన దిశగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ ప్రాముఖ్యతను వివరించారు. పాపాహోం అభివృద్ధికి తోడ్పడుతున్న కమిటీ సభ్యులను, దాతలను సీపీ అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్లామ్ అరిఫ్, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేబీ స్వామి, పాపాహోం సభ్యులు ఎంవీ రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ, కృష్ణారావు ఆచారి, భాస్కర శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ


నిరసన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత వివక్షతో కూడిన చట్టాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య (వీపీఐసీ) ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ 1950 ఉత్తర్వులకు నిరసగా జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ 1960లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ క్రైస్తవ మైనారిటీలకు మాత్రమే వర్తించేలా మత స్వతంత్ర నిరోధక చట్టాలకు తెరలేపారని గుర్తు చేశారు. ఫలితంగా ఆగస్టు 10న బ్లాక్‌డేగా ప్రకటించి దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను మతం మారిన క్రైస్తవ మైనారిటీలకు కుల నిర్మూలన చేస్తూ అదర్ క్రిస్టియన్ పేరిట ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న చట్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో క్రైస్తవులు, సమాఖ్య సభ్యులు పలు ప్రాంతాల మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎం.సుధాకర్‌పాల్, జేమ్స్ కుంపట్ల, కె.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్, బిషప్ ఎంఏ పాల్, పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్'


కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం 'వన్ క్యాడెట్ వన్ ప్లాంట్' కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్లను కాపాడడంపై అవగాహన కల్పించే విషయమై ఈ కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, చెట్ల వల్లే ఈ పచ్చని భూమి, మన జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్. అనురాధ, అధ్యాపక బృందం, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

వెనక్కి మళ్లిన సముద్రం

కొమ్మాది: గత నెల రోజుల నుంచి వర్షాలు, తుపాన్ల నేపథ్యంలో సముద్రం ముందుకు వచ్చి భారీ ఎత్తున అలలు ఎగసిపడి కొన్ని చోట్ల తీరాన్ని భాగీగా కోతకు గురిచేసింది. మంగమారిపేట వద్ద శనివారం సముద్రం శాంతించి కాస్త వెనక్కి మళ్లడంతో తీరమంతా విశాలంగా మారి రాళ్లతో కనువిందు చేసింది. ఇటుగా వచ్చిన పర్యాటకులు కాసేపు సరదాగా గడిపారు.


మంగమారిపేట వద్ద వెనక్కి మళ్లిన సముద్రం

13న హిచ్‌కాక్ జయంతి

మద్దిలపాలెం: ప్రపంచ మేటి సినీ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సభ ఈ నెల 13న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. లండన్‌లో జన్మించిన హిచ్‌కాక్, సాంకేతిక పరిజ్ఞానం లేకున్నా 18, 19 శతాబ్దాల్లో మంచి సినిమాలు అందించారన్నారు. అందుకే ఆయనను మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని పిలుస్తారని చెప్పారు. హిచ్‌కాక్ గొప్పతనాన్ని నేటి తరానికి తెలిపేందుకు 125వ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో సమావేశం అనంతరం హిచ్‌కాక్ దర్శకత్వం వహించిన 'ది బర్డ్స్' చిత్రాన్ని ప్రదర్శిస్తామని, అందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

'హాస్యానందం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంపాదకుడు రాము

సీతంపేట: హాస్య కథా రచయిత గంగాధర్ వడ్లమన్నాటి సంకలనం చేసిన హాస్యానందం పుస్తకావిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి హాస్యానందం సంపాదకుడు పి.రాము పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రతిని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ద్విభాష్యం మాట్లాడుతూ హాస్యం రాయడం చాలా కష్టమైన ప్రక్రియని అన్నారు. అటువంటికి 38 మంది రచయితలు రచించిన సుమారు 350 కథలతో పుస్తకాన్ని సంకలనం చేసిన గంగాధర్‌ను అభినందించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.జి.శంకరరావు, ఎం.సుగుణరావు, కోనె నాగవెంకట ఆంజనేయులు, బి.రత్నకుమారి, వాణి శ్రీనివాస్, సుసర్ల ఆర్వేశ్వ రశాస్త్రి, పాల్గొన్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: రామాటాకీస్ వద్ద 15 కిలోల గంజాయిని ద్వారకా జోన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రామాటాకీస్ దరి ప్రభుత్వ నేత్ర వైద్యశాల వద్ద శుక్రవారం బరంపురం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ఒడిశా నుంచి విశాఖ వచ్చాడు. ఇక్కడి నుంచి బెంగళూరుకు గంజాయిని తరలించడానికి వెళ్తుండగా అనుమానాస్పదంగా అతడు కనిపించడంతో ద్వారకా పోలీసులు తనిఖీలు చేశారు. అతడి వద్ద 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా సీఐ రమేష్ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా తేరు ఊరేగింపు


మేరీమాత స్వరూపాన్ని తేరులో మోస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్, విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తేరు మహోత్సవం నిర్వహించారు. తేరు ఉత్సవంలో దేవవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీప్‌గుర్తువీధి, రే బరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఔషధ గుణాల మొక్కలు పెంచుదాం


కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

తగరపువలస: ఔషధ గుణాలు కలిగిన మొక్కలతో పాటు దేశీయ ఆకుకూరలు, కూరగాయల మొక్కలు నాటుదామని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. శనివారం ఆనందపురం మండలం కేజీబీవీ ఆవరణలో ఆయన విద్యార్థినులతో మొక్కలు నాటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడారు. భవిష్యత్తు తరాల కోసం సామాజిక వనాలు పెంచుదామన్నారు. అధ్యాపకురాలు సంధ్యా ప్రసాదిని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తమ విద్యార్థులు కృషి చేస్తున్నారన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ అందించిన విత్తనాలతో కేజీబీవీని నందనవనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీలక్ష్మి, లక్ష్మి, షీలా, టి.తారక, సరస్వతి, బి.స్వరాజ్యలక్ష్మి, అనురాధ, కుమారి, గ్రీన్ క్లైమేట్ కార్యకర్తలు జనపరెడ్డి రవితేజ, పిల్లా కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ బిల్డింగ్ సమీపంలో స్వల్పమంటలు

తాటిచెట్లపాలెం: ఎల్ఐసీ బిల్డింగ్ ఎదురుగా గల రైల్వే క్వార్టర్స్ సమీపంలో శనివారం రాత్రి స్వల్ప మంటలు చెలరేగాయి. ఈ ప్రాంతంలో గల చెత్తకు ఆకతాయిలు నిప్పు పెట్టడం వల్ల ఈ మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కుప్పలుగా ఖాళీ మద్యం బాటిళ్లు



ఆరిలోవ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో సేకరించిన బస్తాలతో ఖాళీ మద్యం బాటిళ్లు, గ్లాసులు

ఆరిలోవ: చిరు వ్యాపారాల కోసం ఆరేళ్ల కిందట ఆరిలోవ కాలనీ చివరన జీవీఎంసీ అధికారులు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా పడి ఉన్న సంగతి తెలిసిందే. ఈ మార్కెట్ ప్రారంభానికి నోచుకోక పోగా.. మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడి షాపుల్లో కనిపించాల్సిన కూరగాయలు, చేపలు, మాంసం, నిత్యావసర సరకులకు బదులుగా ఖాళీ మద్యం బాటిళ్లతో కూడిన ఎన్నో బస్తాలు దర్శనమిస్తున్నాయి. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 42 షాపులు నిర్మించారు. సుమారు ఆరేళ్లుగా ఎవరికీ వాటిని కేటాయించకుండా ఖాళీగా ఉంచడంతో మందుబాబులు ఇక్కడ తిష్ట వేశారు. వారు తాగి పాడేసిన మద్యం బాటిళ్లు, వాటర్ బాటిళ్లు, పేపర్ గ్లాసులు, పేపర్ ప్లేట్లతో ఈ షాపులన్నీ నిండిపోతున్నాయి. దీంతో కొందరు వాటిని సేకరించి గోనె సంచుల్లో నింపి బయటకు తీసుకెళ్లి విక్రయించుకుంటున్నారు. ఆ ఖాళీ బాటిళ్ల బస్తాలను కుప్పలుగా పేర్చడంతో కూరగాయలు విక్రయానికి పెట్టినట్లు దూరం నుంచి చూసేవారు భ్రమపడతున్నారు. ఇన్ని బాటిళ్ల మద్యం మందుబాబులు తాగేశారా అంటూ స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.